# సత్యవాక్కు

# THE WORD OF TRUTH



## క్రైస్తవ మాసపత్రిక

MARCH-2014

సంవత్సర చందా రూ.50/-

## సంక్షిప్త వార్తలు

2014 ఫిబ్రువరి 20వ తేదీ గురువారం నాడు తూర్పుగోదావరి జిల్లా ర్యాలి గ్రామంలో ఆంధ్రరాష్ట్ర క్రీస్తుసంఘ సువార్తికుల సహవాస సదస్సు జరిగెను. ర్యాలి క్రీస్తుసంఘము పి.యస్.ఆర్.జయపాల్ గారి ఆధ్వర్యములో ఈ సహవాస సదస్సు కొరకు విస్తృత ఏర్పాట్లు చేసిరి. అత్యంత ఆహ్లాదకరమైన వాతవరణంలో ఆనందభరితముగా తీర్చిదిద్దబడిన క్రీస్తుసంఘ ప్రాంగణలో సోదరులు దీనదయల్‌బిషప్ గారి అధ్యక్షతన సహవాస కూడిక ప్రారంభమాయెను. సోదరులు వి.సహదేవుడు(తాడేపల్లిగూడెం), పురుషోత్తం(విజయవాడ), ఎ.విశ్వేశ్వరరావు (కొవ్వూరు), యమ్.సామ్యేల్‌రాజ్(సింగంపల్లి,బిక్కవోలు), టి.వి.సేంసన్‌రాజు (హైదరాబాద్), జాషువా గూటం(కాకినాడ), పి.నాగభూషణం(జంగారెడ్డిగూడెం) నెహెమ్యాగూటం(కాకినాడ)మొదలగువారు క్రీస్తుసంఘము యొక్క విశిష్టతను, సహోదరులు కలసిమెలసి సహవాసములో కొనసాగవలసిన ప్రాముఖ్యతను,సంఘాభివృద్ధికి అవుసరమగు హెచ్చరికలను ఇస్తు చక్కటి సందేశములనిచ్చిరి.

మొదటి శతాబ్ధములోనే క్రీస్తుసంఘము భారతదేశములో స్థాపించబడెను. యేసుక్రీస్తు యొక్క అపొస్తలుడగు తోమా భారతదేశము వచ్చి,మొదట కేరళ రాష్ట్రములోను, తదుపరి తమిళనాడులోను సువార్తప్రకటించి సంఘములను స్థాపించినట్లు దక్షిణ భారతదేశ సంఘ చరిత్రకారుల యొక్క పారంపర్యము వలన తెలియనగును. అతడు సత్యమును బోధించి క్రీస్తుసంఘములనునాటెను. గాని కాలక్రమీణ అవి విశ్వాసభ్రష్టత్వములోపడిపోయి నేడు కేరళలో మార్తోమా సిరియాక్ సంఘముగా పిలువబడుచున్నవి. తోమా మద్రాసు పట్టణములో హతసాక్షి అయినట్లు రుజువుగా సెయింట్ తోమాస్ మౌంట్‌ను,మౌంట్ రోడ్డును ఇప్పటికి యున్నవి.

దరిమిలా 20వశతాబ్ధములో నాడు అస్సాంకు ముఖ్యపట్టణమైన షిల్లాంగ్‌లో క్రీస్తుసంఘము పునరుద్ధరింపబడినది. తదుపరి1963చివర్లో కెనడా నుండి జె.సి.బెయిలీగారు మద్రాసు రాగా,1964 ఫిబ్రువరిలో జాషువాగూటంగారు బాప్తిస్మముపొందిరి. ఆయన20వశతాబ్ధములో దక్షిణభారతదేశములో మొట్టమొదట క్రీస్తుసంఘ సభ్యుడాయెను. నాటి నుండి

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH



P.o. Box-80, Kakinada, A.P. 533 001

Ph : 0884 - 2363722

Editor :

**Joshua Gootam**



*Pleading for Restoration of First Century Christianity*

సంపుటి - 33 | మార్చి - 2014 | సంచిక - 8


## అద్భుతముల సంగతి యేమిటి ?
## (What about the Miracles ?)

ఈ భూమిపై ఒకానొకప్పుడు అద్భుతములను దేవుడు జరిగించెనని చెప్పుచున్న బైబిలు గ్రంథమే ఇప్పుడు అద్భుతములు జరుగుట లేదని బోధించుచున్నది. దేవుడు సమస్తమును అద్భుతము చేసి మొదట ఆరంభించెను. అయితే ఇప్పుడు అద్భుతములు లేకుండ సమస్తమును నడిపించుచున్నారు. అద్భుతము చేసి దేవుడు ఒకే ఒక్క మనుష్యుని, అనగా ఆదామును సృజించెను. ఆటు తరువాత ఈలోకమందు ఉద్భవించిన మానవులందరు ఆదామువలె అద్భుతరీతిగ కాక ప్రకృతి సూత్రముననుసరించి, అనగా దేవుని చట్టముననుసరించి జన్మించినవారై యున్నారు.

బైబిలు గ్రంథమును అద్భుతరీతిగా దేవుడు మన కిచ్చెను. ఆత్మావేశము కలిగినవారు దేవుని వాక్యమును అద్భుతరీతిగా వ్రాసి మనకిచ్చిరి. వారెన్నడు నేర్చుకొనని భాషలలో ఆనాడు వారు సువార్తను ప్రకటించిరి. అయితే బైబిలు ఎప్పుడయితే సంపూర్తిగ లిఖింపబడెనో, అద్భుతకార్యములు అంతమాయెను. మొదటి

శతాబ్దములో అద్భుతకార్యముల యొక్క ప్రయోజనము ఒకే ఒక్కటియై యుండెను. దేవుని వాక్యమును స్థిర పరచుటయే వాటి ప్రయోజనము. అపొస్తలులుబయలుదేరి వాక్యమును ప్రకటించుచుండగా ప్రభువు వారికి సహకారుడైయుండి వెనువెంట జరుగుచు వచ్చిన సూచక క్రియల వలన వాక్యమును స్థిరపరచుచుండెను అని మార్కు 16:20 లో వ్రాయబడి యున్నది. ఆవాక్యము స్థిరపరచబడి మనకు ఇప్పుడు ఇయ్యబడి యున్నది అని హెబ్రీ 2:2 చెప్పుచున్నది.

మనము దేవునియందు, ప్రభువైన యేసుక్రీస్తునందు నమ్మవలెనంటే అద్భుతములు అనవసరము. ఈనాడు క్రీస్తును గూర్చి వినుట ద్వారా గాని లేక చదువుట ద్వారా గాని మనకు విశ్వాసము కలుగును అని రోమా 10:17, యోహాను 20:30,31లలో వ్రాయబడి యున్నది. దేవుని వర్తమానము ఈనాడు అద్భుత రీతిగా కాక సామాన్యమానవుల ద్వారా బోధింపబడుచున్నది. దేవుడు అద్భుతరీతిగ మానవులను ఈనాడు ఎట్లు సృజించుటలేదో అట్లే అద్భుత రీతిగ తన వాక్యమును ఎవరికి బయలు పరచుట లేదు.

దేవుని యొక్క సంకల్పములో ఈనాడు అద్భుతములకు చోటులేదు. అద్భుతముల ద్వారా గాక లేఖనముల ద్వారా తన ప్రజలు సంపూర్ణులు కావలెనని దేవుని సంకల్పమై యున్నది. అందుకే "దైవజనుడు సన్నద్ధుడై ప్రతి సత్కార్యమునకు పూర్ణముగా సిద్ధపడి యుండునట్లు దైవావేశము వలన కలిగిన ప్రతి లేఖనము ఉపదేశించుటకును, ఖండించుటకును. తప్పుదిద్దుటకును, నీతియందు శిక్ష చేయుటకును ప్రయోజనకరమై యున్నది" అని అపొ.పౌలు వ్రాసెను (2 తిమో 3:16,17).

యేసుక్రీస్తు అనేక అద్భుతములు, సూచక క్రియలు చేసెను. వాటిలో కొన్ని మాత్రమే బైబిలునందు వ్రాయబడెను. యేసు దేవుని కుమారుడైన క్రీస్తు అని మనము నమ్మునట్లును, నమ్మి ఆయన నామమందు జీవము పొందునట్లును అవి వ్రాయబడెను అని యోహాను 20:30,31 బోధించుచున్నది. అద్భుతములను నిత్యము కొనసాగించవలెనని దేవుని సంకల్పము కాదు. సరిగదా ఆ యద్భుతములను గూర్చిన శాశ్వత రికార్డు, అనగా బైబిలు గ్రంథము మనకీయవలెనునది ఆయన సంకల్పమై యున్నది. దైవావేశ లేఖకులచే ఆ గ్రంథము వ్రాయబడినందున, అందున్న అద్భుతములను గూర్చి పాఠకులు చదువు నప్పుడు వారు యేసునందు విశ్వాస ముంచెదరు. అద్భుతములను గూర్చిన సత్యము ఒకసారి నిరూపింపబడెను గనుక అది ప్రతినిత్యము నిరూపింప బడనవ

సరము లేదు. మొదటి శతాబ్దము నుండి నేటివరకు జీవించిన ప్రజలు అద్భుతములను చూడకనే, అద్భుతము లను గూర్చి బోధించుచున్న క్రొత్త నిబంధన గ్రంధమును చదువుట వలన లేదా అందున్న సంగతులను గూర్చి వినుట వలన లేదా ఈ రెండింటి వలన యేసు నందు విశ్వసించుచునే యున్నారు. యేసునందు ఈనాడు మనము విశ్వసించవలెనంటే అద్భుతముల అవుసరము లేనే లేదు.

మొదటి శతాబ్దములో దేవుడు సంఘమునకిచ్చిన అద్భుత వరములు ఆగిపోవునని, అవి అసంపూర్ణములును, తాత్కాలికమునై యున్నవని క్రొత్తనిబంధన బోధించుచున్నది. 1కొరింధి 13: 8-10లో ఇట్లు వ్రాయబడి యున్నది : "ప్రేమ శాశ్వతకాలముండును. ప్రపచనములైనను నిరర్ధకములగును; భాషలైనను నిలిచిపోవును, జ్ఞానమైనను నిరర్ధకమగును; మనము కొంతమట్టుకు ఎరుగుదుము, కొంతమట్టుకు ప్రవచించుచున్నాము. గాని పూర్ణమైనది వచ్చినప్పుడు పూర్ణముకానిది నిరర్ధకమగును". క్రొత్త నిబంధన పూర్ణముగ లిఖింపబడలేనప్పుడు దేవుడు తన వాక్యమును కొంచెము కొంచెముగా (Part by Part) బయలు పరచు చుండెను. గాని ఆయన వాక్యము పూర్ణముగా బయల్పరచబడగానే అసంపూర్ణములైన అద్భుత వరములు విరమించబడెను. "కాగా విశ్వాసము, నిరీక్షణ, ప్రేమ-యీమూడును నిలుచును; వీటిలో శ్రేష్టమైనది ప్రేమయే" అని పరిశుద్ధాత్ముడు బోధించెను (1 కొరి 13:13).

అపొస్తలులు పరిశుద్ధాత్మని సహాయముచే సర్వ సత్యమును బోధించిరి, దానిని మనకొరకు లిఖించిరి (యోహాను 16:13). దేవుడు బయల్పరచిన సత్యమంతయు బైబిలులోనే యిమిడి యున్నది. అందువలన లేఖనములను మీరు పరిశోధించుడి. అందులో మీకు నిత్యజీవమున్నదని యేసు బోధించెను (యోహాను 5:39). లిఖింపబడిన దేవుని వాక్యమే మనలను సంపూర్ణులుగ చేయుశక్తి కలది (2 తిమో 3:16,17). బైబిలు గ్రంధము పరిపూర్ణమైనదగుటచే దానికి మనము కలుపుట గాని, తీసివేయుటగాని జరుగరాదని ప్రభువు హెచ్చరించెను (ప్రక 22:18,19). స్వప్నముల ద్వారాను, దర్శనములద్వారాను ప్రభువునాతో మాటలాడుచున్నాడని చెప్పుకొనువారనేకులు మనమధ్యన ఉన్నారు. అట్టివారు దేవుని వాక్యము నెరుగక పొరబడుచున్నారని మనము గ్రహించవలెను.

"అందువలన మనమిక మీదట పసిపిల్లలమై యుండి, మనుష్యుల మాయోపాయములచేత వంచనతోను,

తప్పు మార్గమునకు లాగు కుయుక్తితోను, గాలికి కొట్టుకొని పోవునట్లు కల్పింపబడిన ప్రతి ఉపదేశమునకు ఇటు అటు కొట్టుకొనిపోవుచు అలలచేత ఎగుర గొట్ట బడిన వారమైనట్టుండక, ప్రేమ కలిగి సత్యము చెప్పుచు క్రీస్తువలె ఉండుటకు మన మన్ని విషయములలో ఎదుగుదము" అని ఎఫెసీ 4:14, 15లో అపొ.పౌలు మనలను హెచ్చరించు చున్నాడు.

అందు వలన మిత్రులారా, ఆత్మీయ విషయములలో మనము వినుచున్న ప్రతిసంగతియు సత్యమో కాదోయని దైవవేదమునుండి పరిశీలించి తెలిసికొను బాధ్యత మన ప్రతి ఒక్కరిదై యున్నది. బెరయలోని ప్రజలకు పౌలును, సీలయు వాక్యమును బోధించు చుండగా, వారు చెప్పిన సంగతులు ఆలాగున్నవో లేవో అని ప్రతిదినమును లేఖనములను వారు పరిశోధించుచు వచ్చిరి. పౌలు, సీలాల వాక్యమునే మొదటి శతాబ్దపు ప్రజలు జాగరూకతతో పరిశోధించిన యెడల ఈ 20వ శతాబ్దములో మనము వినుచున్న వాక్యమును మరింత జాగరూకతతో పరిశోధించవలసిన బాధ్యత మనపై యున్నది. అందుకే "మీరేమి వినుచు న్నారో జాగ్రత్తగా చూచుకొనుడి" యని యేసు హెచ్చరించెను (మార్కు 4:24).

అపవాది నానావిధములైన సూచక క్రియలతోను, అబద్ధ విషయమైన బలముతోను, మోసముతోను పనిచేయు చున్నాడని 2 థెస్స 2:9-12లో వ్రాయ బడియున్నది. అపవాది సంబంధులు చేయు అద్భుతములు నిజము కాదు. అట్టి వారిని గూర్చి యేసు మత్తయి 7:22లో ఇట్లు చెప్పెను : "ఆ దినమందు అనేకులు నన్ను చూచి, ప్రభువా, ప్రభువా, మేము నీనామమున ప్రవచింపలేదా? నీనామము న దయ్యములను వెళ్ళగొట్ట లేదా? నీనామమున అనేకమైన అద్భు తములు చేయలేదా? అని చెప్పుదురు. అప్పుడు- నేను మిమ్మును ఎన్నడును ఎరుగను; అక్రమముచేయు వారలారా, నాయొద్ద నుండి పొండని వారితో చెప్పుదును.'' క్రీస్తు నామముననే అక్రమము చేయు వారిని గూర్చి ముందుగ హెచ్చరింపబడితిమి గనుక మనము ఆశ్చర్యపడక మెళకువగా యుండవలెను. "ఏలయనగా అట్టి వారు క్రీస్తుయొక్క అపొస్తలుల వేషము ధరించుకొనువారై యుండి, దొంగ అపొస్తలులును, మోసగాండ్రగు పని వారునై యున్నారు. ఇది ఆశ్చర్యము కాదు; సాతాను తానే వెలుగు దూత వేషము ధరించుకొనుచున్నాడు" అని 2 కొరింథి 11:13, 14లో వ్రాయబడి యున్నది.

"ప్రభువా, ప్రభువా అని నన్ను పిలుచు ప్రతివాడును పరలోక రాజ్యములో ప్రవేశింపడుగాని, పరలోకమందున్న నాతండ్రి చిత్తప్రకారము చేయువాడే ప్రవేశించును" అని మత్తయి 7:21లో యేసు పలికెను. నీవు ఇంకను క్రైస్తవుడవు కానియెడల, క్రీస్తునందు విశ్వసించి, నీ పాపముల విషయమై మారుమనస్సు బొంది, క్రీస్తులోనికి బాప్తిస్మము పొంది పరలోకమందున్న తండ్రి చిత్తమును నెరవేర్చుము. నీవు క్రైస్తవుడవయిన యెడల ఆయనకు నమ్మకమైన జీవితమును జీవించుము. నీవు యితరులను రక్షించుటకు రక్షింపబడి యున్నావని గ్రహించి సువార్తప్రకటించుము. అట్లు చేసి పరలోకపు తండ్రి చిత్తమును నెరవేర్చుదువనియే నా విశ్వాసము.

## తలాంతులను గూర్చిన ఉపమానము
## (The Parable of the Talents)

మత్తయి 25:14-30

**పరిచయము:**

యేసు ఇంకా ఒలీవ కొండమీద యుండగానే, పదిమంది కన్యకలను గూర్చిన ఉపమానము చెప్పిన వెంటనే అపొస్తలులకు ఆయన తలాంతులను గూర్చిన ఉపమానము చెప్పెను. మొదటి దానిలో సిద్ధపాటును గూర్చి చెబితే ఈ రెండవదానిలో ఆయన శిష్యులు కనిపెట్టుచు కష్టపడి పనిచేయాలని హెచ్చరించారు.

**ఉపమానము :**

"పరలోక రాజ్యము ఒక మనుష్యుడు దేశాంతరమునకు ప్రయాణమై తన దాసులను పిలిచి తన ఆస్తిని వారి కప్పగించినట్లుండును. అతడు ఒకనికి అయిదు తలాంతులను ఒకనికి రెండు ఒకనికి ఒకటియు ఎవని సామర్థ్యము చొప్పున వానికిచ్చి వెంటనే దేశాంతరము పోయెను. అయిదు తలాంతులు తీసికొనినవాడు వెళ్లి వాటితో వ్యాపారము చేసి మరి అయిదు తలాంతులు సంపాదించెను. ఆలాగుననే రెండు తలాంతులు తీసికొనినవాడు మరి రెండు సంపాదించెను. ఆలాగుననే రెండు తలాంతులు తీసికొనినవాడు మరి రెండు సంపాదించెను. అయితే ఒక తలాంతు తీసికొనిన వాడు వెళ్లి భూమి త్రవ్వి తనయజమానుని సొమ్ము దాచిపెట్టెను. బహుకాలమైన తరువాత ఆ దాసుల యజమానుడు వచ్చి వారి యొద్ద లెక్క చూచుకొనెను. అప్పుడు అయిదు తలాంతులు తీసికొనిన వాడు మరి

అయిదు తలాంతులు తెచ్చి –అయ్యా నీవు నాకు అయిదు తలాంతులు అప్పగించితివే! అవియు గాక మరి అయిదు తలాంతులు సంపాదించి తినసెను. అతని యజమాను డు – భళా నమ్మకమైన మంచి దాసుడా, నీవు ఈ కొంచెములో నమ్మకముగా ఉంటివి, నిన్ను అనేకమైన వాటి మీద నియమిం చెదను. నీ యజమానుని సంతోషములో పాలుపొందుమని అతనితో చెప్పెను. ఆలాగే రెండు తలాంతులు తీసికొనిన వాడు వచ్చి, ఆయ్యా నీవు నాకు రెండు తలాంతులు అప్పగించితివే, అవియు గాక మరి రెండు తలాంతులు సంపాదించి తినని చెప్పెను. అతని యజమానుడు, భళా నమ్మకమైన మంచి దాసుడా, నీవు ఈ కొంచెములో నమ్మకముగా ఉంటివి, నిన్ను అనేకమైన వాటిమీద నియమిం చెదను, నీయజమానుని సంతోషములో పాలుపొందుమని అతనితో చెప్పెను. తరువాత ఒక తలాంతును తీసికొనిన వాడు వచ్చి– అయ్యా నీవు విత్తని చోట కోయు వాడవును, చల్లని చోట పంట కూర్చు కొనువాడవునైన కఠినుడవని నేనెరు గుదును. గనుక నేనుభయపడి, వెళ్లి నీ తలాంతు భూమిలో దాచిపెట్టి తిని. ఇదిగో నీది నీవు తీసికొనుమని చెప్పెను. అందుకు అతని యజమానుడు వానిని చూచి సోమరివైన చెడ్డదాసుడా, నేను విత్తనిచోట కోయువాడను, చల్లని చోట పంటకూర్చుకొనువాడనని నీవు ఎరుగుదువా? అట్లయితే నీవు నా సొమ్ము సాహుకారుల యొద్ద ఉంచవలసి యుండెను. నేను వచ్చి వడ్డీతో కూడ నాసొమ్ము తీసికొనియుందునే అని చెప్పి ఆ తలాంతును వాని యొద్దనుండి తీసి వేసి, పది తలాంతులుగల వానికియ్యుడి కలిగిన ప్రతివానికి ఇయ్యబడును అతనికి సమృద్ధి కలుగును. లేనివానియొద్దనుండి వానికి కలిగినదియు తీసివేయబడును. మరియు పనికిమాలిన ఆదాసుని వెలుపటి చీకటిలోనికి త్రోసి వేయుడి; అక్కడ ఏడ్పును పండ్లు కొరుకుటయు ఉండుననెను" (మత్తయి 25:14-30).

ఈ ఉపమానములో ఒక యజమానుడు దేశాంతరమునకు వెళ్లక ముందు తన ఆస్తిని ముగ్గురు దాసులకు అప్పగించుట మనము చూడగలము. ఏవిధమైన పర్యవేక్షణ లేకపోయినను ఇద్దరు దాసులు బాగుగా పనిచేసిరి. మూడవవాడైతే గృహనిర్వాహ కునిగా సరిగా పనిచేయలేదు. నమ్మకముగా లేడు (1 కొరింథీ 4:2). తన చేతికి అప్పగించిన ఆస్తిని అతడు పాడుచేయ లేదు. తన యజమాని ఆస్తిని కాజేయ లేదు కూడ. అయినను అతడు నమ్మకముగా పనిచేయ

లేదు. తలాంతులను గూర్చిన ఈ ఉపమానము ముఖ్యముగా ఈ మూడవ వానిపై కేంద్రీకృతమైయున్నది.

గ్రీగు భాషలో దాసులు అనగా దాసత్వము చేయువారు బానిసలు అనుభావమున్నది. కొన్ని సందర్భాల్లో బానిసలు తమ యజమానుని స్థితాస్థిపై పర్యవేక్షకులుగా యుండేవారు (ఉదా ఆదికా. 39:4లో యోసేపు). ఈ ఉపమాన ములో యజమానుడు దాసులకు తన ఆస్థిని అప్పగించాడు. అవి తలాంతులు. ఇక్కడ చెప్పబడిన తలాంతు తూనికలో ఒక పరిమాణము. అది ఆయా ప్రదేశా లలో వేర్వేరుగా భావించబడేది. మన ప్రభువు కాలములో ఒక తలాంతు బరువు గల వెండి ఇంచుమించు 50,000 రూ॥లు వుండేదని కొందరు వ్యాఖ్యాన కర్తలు భావిస్తారు. ఇయ్యబడిన తలాంతులు వెండిగాని, బంగారముగాని కావచ్చును.

యజమానుడు తన దాసులకున్న సామర్థ్యము చొప్పున వారికి తలాంతుల నిచ్చెను. మరియు వారినుండి ప్రతి ఫలమును, లాభమును అపేక్షించెను. ఒకనికి అయిదు, మరొకనికి రెండు, ఇంకొకనికి ఒక తలాంతును యిచ్చెను. అయిదు, రెండు తలాంతులు పొందిన వారు వాటిని రెట్టింపుచేసి యజమానికి లెక్క అప్పగించిరి. అయితే ఒక్క తలాంతు పొందినవాడు దానిని భూమిలో దాచిపెట్టి యుంచెను. అతడు సోమరి యైన చెడ్డ దాసుడని పిలువబడెను.

తలాంతులు యిచ్చిన యజమానుడు దేశాంతరము నుండి తిరిగి వచ్చి తన దాసుల దగ్గర లెక్క చూచుకొనెను. మొదటి ఇద్దరు దాసులను గూర్చి అతడు మిక్కిలి సంతోషించెను. వారికి పదవోన్నతి కల్పించెను. సోమరియైన చెడ్డదాసుడని గూర్చి మిక్కిలి ఆగ్రహించెను.

సోమరియైన దాసుడు తన అసామర్థ్యతను కప్పిపుచ్చుకొనుటకు ప్రయత్నించి యజమానుడు అవినీతి పరుడని చెప్పజూచెను. అట్టి విమర్శలను బట్టి యజమానుడు కృంగిపోలేదు. లక్ష్యమును కోల్పోలేదు. నిజానికి ఈదాసుడు తన యజమానుని స్థితిని అంచనా వేసే స్థాయిలో ఏమాత్రమును లేడు. తన అసామర్థ్యతను యజమాని పై రుద్దుటకు ప్రయత్నించినా, అది ఫలించలేదు. యజమానుడు తన్ను తాను సమర్థించుకొనుటకు ప్రయత్నిం చలేదు. సరిగదా ఆదాసుని అతడు "సోమరివైన చెడ్డదాసుడా" అని సంబోధించాడు. దాసుడు చెప్పే పనికి మాలిన సాకులను తిరస్కరించి "నీవు నా సొమ్ము సాహుకారుల యొద్ద

ఉంచవలసి యుండెను; నేను వచ్చి వడ్డీతో కూడ నాసొమ్మును తీసికొని యుందునే" అని అతని హెచ్చరించెను. అతని కియ్యబడిన ఆ ఒక్క తలాంతు అతని యొద్ద నుండి తీసివేయబడి వేరొకనికి ఇయ్యబడెను. పనికిమాలిన ఆ చెడ్డదాసునికి శిక్ష విధించబడెను.

(చెడ్డదాసుని యొక్క ఆక్షేపణలను యజమానుడు నిరాకరించుటకు ప్రయత్నించలేదు! అవి వాస్తవమే! ఆ యజమానుడు మితంగా ఖర్చుపెట్టే వాడు, దుబారా చేయువాడు కాడు ఏలయనగా అతడు విత్తని చోట కోయు వాడు, చల్లని చోట పంట కూర్చు కొనువాడు! అతడు విత్తుచుండగా గట్టు మీదను, పొలములో మూలలోను పడిన విత్తనముల పంటను కూడ అతడు కోసేవాడు).

దేశాంతరమునకు ప్రయాణమైన యజమానుడు యేసుక్రీస్తు. దాసులు మొదట అపొస్తలులు, తదుపరి విశ్వ వ్యాప్తంగా యున్న క్రీస్తు సంఘ సభ్యులు. ఆస్థి, తలాంతులు అందరి యెడల యున్న క్రైస్తవుని బాధ్యతలు. యజమానుడు బహుకాలము తరువాత తిరిగి వచ్చుట యేసుక్రీస్తు ఆరోహణమై నప్పటి నుండి ఆయన మరల తిరిగి వచ్చేవరకు యున్న సమయం. బహు కాలము తరువాత యజమానుడు లెక్కచూచుకొనుటకు తిరిగి వచ్చుట క్రీస్తు యొక్క రెండవ రాకడయై యున్నది. యజమానుడు ఒక్కొక్కని లెక్క చూచుట కడవరి తీర్పు అయ్యున్నది. పనికిమాలిన చెడ్డ దాసుడు వెలుపలికి త్రోసివేయ బడినట్లు, అపనమ్మకముగా యున్న వారు నిత్యనరకములో పడవేయబడు దురు.

ప్రతి దాసునికి యజమానుడు తలాంతుల నెట్లు యిచ్చాడో, అట్లే సంఘములో ప్రతి క్రైస్తవునికి బాధ్యతలు అప్పగింపబడి యున్నవి. తలాంతులు పొందని దాసుడు ఎవరులేరు. బాధ్యతలు లేని క్రైస్తవులు ఎవడు వుండరు. అయితే వారి వారి సామర్ధ్యతలు, తలాంతులు, తరుణములు వేర్వేరుగా యుండును. తరుణాలతో బాధ్యతలు సమానముగా యుండును.

సామర్ధ్యము కొలది తలాంతులు యిచ్చి, వారి సామర్ధ్యము కొలది ఫలితముల నాశించుటలో, క్రైస్తవులు తమ సామర్ధ్యము కొలదీ సంఘములో పనిచేయాలని ప్రభువు కోరుచున్నారు (1 కొరింథీ 10:13; ఫిలిప్పీ 4:13). నీవు గొప్పవాడవుగా యుండాలని గాక నమ్మకముగా యుండాలని ప్రభువు కోరుచున్నారు. తక్కువ సామర్ధ్యము

వలన అవనమ్మకముగా యుంటే మంచిది కాదు. దేవుడు ఎల్లవేళలా మననుండి శ్రేష్టమైన దానినే కోరును. పాక్షిక విధేయత, ఉదాసీనత మొ॥నవి అంత్యదినమందు ఉపేక్షించబడవు. తక్కువలో నేమి ఎక్కువలో నేమి దేవుడు నమ్మకత్వమునే నీ నుండి కోరుకొనును.

క్రీస్తుయొక్క రెండవ రాకడకు కనిపెట్టుచు ప్రతిక్రైస్తవుడు ఆయన కొరకు పనిచేయవలెను. పరిచర్యలోను, లెక్క అప్పగించుటలోను క్రైస్తవునికి ఉన్న వ్యక్తిగత బాధ్యతను తలాంతులను గూర్చిన ఈ ఉపమానము తెలియ జేయుచున్నది. (2 కొరింథీ 5:10–11; ప్రసంగి 12:13–14; ప్రక 20:11–15). ఈ లోకంలో మనము చేయు పరిచర్య లేదా చేయలేకపోయిన పరిచర్య మన నిత్యగమ్య స్థానమును నిర్ణయించునని ప్రతి క్రైస్తవుడు ఎరిగి యుండాలి (మత్త 25:31–46). ఈ ఉపమానములోయున్న యజమానివలె తీర్పునాడు క్రీస్తు క్రైస్తవులకు న్యాయ బద్ధముగానే తీర్పుతీర్చును. అనాడు నమ్మకముగా పనిచేసిన క్రైస్తవులు సంతోషించుదురు గాని సోమరులైన మనము వారు తీర్పరిని చూచి భయపడుదురు.

**ముగింపు :**

శక్తి సామర్థ్యములలో, తరుణ ములలో తమ్మును తాము తక్కువగా అంచనావేసుకొను క్రైస్తవులు క్రైస్తవ పరిచర్యలో వెనుకాడకూడదు. అట్టి వారు తమ కియ్యబడిన తలాంతు లను, శక్తి సామర్థ్యాలను క్రైస్తవ పరిచర్య కొరకు వినియోగించాలి. సాకులు చెప్పుట మాని క్రైస్తవ పరిచర్య కొరకు వినియోగించాలి. సాకులు చెప్పుట మాని క్రైస్తవ బాధ్యతలను సంతోషముతో స్వీకరించాలి.

నిస్సందేహంగా మనందరం మన తరుణాలను కొంత వ్యర్థపరచి యుందుము. ఒక్కొక్కనికి గొప్ప ద్వారము (తరుణము) తెరువబడునట్లు మనం ప్రార్థించాలి (1 కొరింథీ16:9). అట్టి తరుణం లభించినప్పుడు దానిని సద్వినియోగం చేసుకోవాలి (అపో.కా. 4:29). అపో.పౌలు చెరసాలలో యున్నా, బంధకములలో యున్నా, న్యాయవిమర్శలో నిలబడినా, అన్ని సందర్భములను క్రీస్తును చాటే తరుణ ములుగా మార్చుకున్నాడు. ప్రతి క్రైస్తవుడు ఈలోకాన్ని తరుణము, బాధ్యత అను కంటి అద్దాలతో చూడాలి. అట్లు చూడకపోతే క్రైస్తవులమయినను పరలోకమును చూడలేము.

– లూయిస్ రష్‌మోర్

## క్రైస్తవ్యము పరసంబంధమైనది, ఇహసంబంధమైనది
## (Christianity is both Spiritual and Materialistic)

పరమందొక దేవుడున్నారు! మనకెట్లు తెలియును? విజ్ఞానశాస్త్రము, న్యాయశాస్త్రము, ఖగోళశాస్త్రము, జీవశాస్త్రము, వివేచన మొదలగు రుజువులు మనకు ఆయనను నిరూపించు చున్నాయి. ఇన్ని రుజువులున్నను, కొందరు శంకింతురు, కొందరు ప్రశ్నింతురు, మరికొందరు నిరాకరింతురు, వారి అనుమానములకు, ప్రశ్నలకు, నిరాకరణకు కారణమేమిటి ?

దేవునియందలి విశ్వాసము వలన ఒకడు సోమరియగును, ప్రయోజనకారి కాకపోవును ఏలయనగా అతని తలంపులు, నిరీక్షణ అంతావేరొక లోకము వైపే యుండునని కొందరి భావన. దేవుని యందు విశ్వాసముంచిన వారు వేరొక లోకములో ప్రతిఫలము పొందుదామనే భావనవలన ఈలోకములో వారు ఎవ్విధమైన పోరాటము చేయక శ్రమలనను భవింతురు. ఇహలోక ఆశలు వారికుండవు గనుక సోమరులగుదురని కొందరి భావన.

**విశ్వాసికి వేరొక లోక నిరీక్షణ యున్నది.**

దేవునియందలి విశ్వాసి వేరొక లోక నిరీక్షణను కలిగి యున్నాడన్నునది నిజమే. కీర్తన 16:9లో "నాహృదయము సంతోషించుచున్నది. నాఆత్మ హర్షించుచున్నది" యని దావీదు చెప్పాడు. "నా ప్రభువా, నా నిరీక్షణాస్పదము నీవే, బాల్యము నుండి నా ఆశ్రయము నీవే" యని కీర్తన71:5లో వ్రాయబడియున్నది. "యెహోవాను నమ్ముకొను వాడు ధన్యుడు, యెహోవా వానికి ఆశ్రయముగా ఉండును" (యిర్మీయా17:7). అబద్ధమాడజాలని దేవుడు వాగ్దానము చేసిన నిత్యజీవ నిరీక్షణను గూర్చి పౌలు తీతు 1:1-2లో వ్రాసాడు. "మృతులలో నుండి యేసు క్రీస్తు తిరిగి లేచుట వలన జీవముతో కూడిన నిరీక్షణ మనకు కలుగు నిమిత్తము ఆయన మనలను జన్మింపజేసెనని" 1పేతురు 1:1-3లో వ్రాయబడి యున్నది. ఈలోకములో జీవము బహు స్వల్పము త్వరలో మనందరము చనిపోవలసినదే, గనుక ఈ లోకములో నిత్యము జీవించెదమని ఎవరు నిరీక్షించలేరు. అయితే ఒకడు మరణమవగానే జీవము అంతరించి పోదని క్రైస్తవుడునమ్మును. మానవుని ఆత్మ అమర్త్యమైనది ఈలోక జీవ నానంతరము అది వేరొక లోకంలో

జీవిస్తునే యుండును అతడు దీని యందు విశ్వసించును గనుక వేరొక లోక నిరీక్షణను కలిగి యున్నాడు.

**నిరీక్షణ వలన సోమరితనము జనించదు :**

నిర్దేవులు చెప్పురీతిగా అట్టి నిరీక్షణవలన దేవునియందలి విశ్వాసి సోమరిగా తయారవ్వడు. ఇప్పుడు ఈలోకంలో అతని పరిస్థితి మెరుగు పరుచుకొనుటకు ఈనిరీక్షణ అడ్డు రాదు. "బద్దకముగా పనిచేయు వాడు దరిద్రుడగును. శ్రద్ధ గలవాడు ఐశ్వర్య వంతుడగును. వేసవికాలమున కూర్చు వాడు బుద్ధిగల కుమారుడు. కోత కాలమందు నిద్రించువాడు సిగ్గుపరచు కుమారుడు" అని బైబిలు చెప్పుచున్నది (సామె 10:4-5). "పనిలో జాగుచేయువాడు నష్టము చేయువానికి సోదరుడు" (సామె 18:9). "విత్తులు వేయుకాలమున సోమరిదున్నడు. కోతకాలమున పంటను గూర్చివాడు విచారించు నప్పుడు వాని కేమియు లేకపోవును" (సామె 20:4). "ఎవడైనను పనిచేయ నొల్లని యెడల వాడు భోజనము చేయరాదని" 2థెస్స 3:10 చెప్పు చున్నది. ఈ లేఖనముల వెలుగును బట్టి దేవుని యందలి విశ్వాసము వలనను, క్రైస్తవ్యము వలనను ప్రజలు సోమరులై పనిచేయనొల్లరని ఎవడును చెప్పజాలడు.

**విశ్వాసులు సంపదను పోగొట్టుకొనరు :**

దేవుని యందు విశ్వాసి సంప న్నుడయ్యే నిరీక్షణను పోగొట్టుకొనునా ? అతని నిరీక్షణ అంతా రాబోవు లోకమేనా? కొన్ని లేఖన భాగములు ఇట్టి భావమును కలుగ జేయును. గాని వాటిని మాత్రమే గాక మిగతా లేఖనములను కూడ మనము పరికించవలెను. దిగువ వాటిని గమనించుము.

"ఈలోకమునైనను లోకములో ఉన్నవాటినైనను ప్రేమింపకుడి; ఎవడైనను లోకమును ప్రేమించిన యెడల తండ్రి ప్రేమ వానిలో నుండదు" (I యోహాను 2:15).

"పైనున్న వాటి మీదనే గాని భూసంబంధమైన వాటిమీద మనస్సు పెట్టుకొనకుడి" (కొలస్స 3:2).

మీరు ఈలోక మర్యాదను అనుసరింపక ఉత్తమమును, అనుకూల మును సంపూర్ణమునై యున్న దేవుని చిత్తమేదో పరీక్షించి తెలిసికొనుడి" (రోమా 12:2).

"శరీర స్వభావము గలవారు దేవుని సంతోషపరచనేరరు" (రోమా 8:6).

"భూమి మీద మీకొరకు ధనమును కూర్చుకొనవద్దు; ఇక్కడ చిమ్మెటయును తుప్పును తినివేయును, దొంగలు కన్నమువేసి దొంగిలెదరు,

పరలోకమందు మీకొరకు ధనమును కూర్చుకొనుడి; అచ్చట చిమ్మెటయైనను తుప్పైనను దాని తిని వేయదు. దొంగలు కన్నము వేసి దొంగిలరు" (మత్తయి 6:19-20).

దేవుని బిడ్డయైన వాడు కేవలము ఈలోక సంబంధసంగతులపైనే తన నిరీక్షణ నుంచ కుండా ఇవన్నీ చెప్ప బడ్డాయి. దేవుడు చెప్పిన ఈ మాటలు సత్యము వాటిని మనం అనుసరించాలి. అయినను దేవుని ప్రజలు తమ శక్తి సామర్థ్యములనుపయోగించి ధనాన్ని సంపాదించు కోవాలని కూడ చెప్ప బడినది. "దొంగిలు వాడు ఇక మీదట దొంగిలక అక్కర గలవానికి పంచిపెట్టు టకు వీలు కలుగు నిమిత్తము తన చేతులతో మంచి పని చేయుచు కష్టపడ వలెను" (ఎఫెసీ 4:28).

"నీపశువుల స్థితి జాగ్రత్తగా తెలిసికొనుము, నీమందల యందు మనస్సు ఉంచుము. ధనము శాశ్వతము కాదు" (సామెతలు 27:23-24). ఇహలోక సంగతులను గూర్చి చింతించ వద్దని ప్రభువు తన శిష్యులను హెచ్చ రించిన తరువాత, "ఇవన్నియు మీకు కావలెనని మీ పరలోకపు తండ్రికి తెలియును" అని యేసు చెప్పెను (మత్తయి 6:32). మరల ఆయన సేవ చేయువారు ఈలోకములో వందరెట్లు ఎక్కువ పొందుదురని ఆయన నిర్ధారణ నిచ్చెను (మార్కు 10:29-30).

**నీతివలన ప్రతిఫలము కలుగును :**

నీతిగల జీవితము, యదార్థమైన ప్రవర్తన, కృషి వలన ఈలోకములో గొప్ప ఆర్థిక ప్రతిఫలములు కలుగును. "శ్రద్ధ గలవాడు ఐశ్వర్యవంతుడగును" అని బైబిలు చెప్పుచున్నది (సామెతలు 10:4). "తన పనిలో నిపుణత గల వానిని చూచితివా? అల్పులైన వారి యెదుట కాదు వాడు రాజుల యెదుటనే నిలుచును" (సామెతలు 22:29). "శరీర సంబంధమైన సాధకము కొంచెము మట్టుకే ప్రయోజన కరమవును గాని దైవభక్తియిప్పటి జీవము విషయము లోను రాబోవు జీవము విషయములోను వాగ్దానముతో కూడినదైనందున అది అన్ని విషయములలోను ప్రయోజనకర మవును" అని 1తిమోతి 4:8 చెప్పు చున్నది. నీతి మంతుడు నీటి యోరను నాటబడిన ఫలమిచ్చు చెట్టువలెయుండు నని కీర్తన 1:3లో చెప్ప బడియున్నది.

అబ్రాహాము దేవుని మిత్రుడని చెప్పబడెను. అతనికి విస్తారమైన ఆస్థియుండెను. దేవుని యందు భయ భక్తులు గల యోబు చాలధనవంతుడు. యోసేపు దేవుని సేవించుచు ఐగుప్తు దేశమునకు ఏలికయాయెను. దావీదు, సొలొమోనుల యొక్క సంపద ఎంత

గొప్ప దంటే, షేబదేశపు రాణికూడ దానిని చూచుటకు వచ్చెను. దేవుని భక్తులు ఇట్టిసంపదను ఎందుకు కలిగియుండిరి? వారు బీదలను కొల్లగొట్టినందునా? కానేకాదు గాని అది వారి నీతి గల జీవితఫలము. దేవునియందు నమ్మిక లేని వాడు లోభియై స్వార్థపరజీవితము జీవించును. తద్వారా నాశనమును కొనితెచ్చుకొనును. అతడు తన శక్తిని త్రాగుటకు, తినుటకు, విలాసములకు వెచ్చించి తన శరీర దారుఢ్యమును, వివేచనను కోల్పోవును. అతడు మోసగించును, అబద్ధములాడును. దొంగిలించును. చివరకు తన ఇరుగుపొరుగు వారి అభిమానమును కోల్పోవును.

దేవునియందు భయభక్తి గలవాడు స్వస్థచిత్తుడు, యదార్థవంతుడు, నమ్మకస్థుడు, మితముగా యుండువాడు, నిస్వార్థపరుడు; ఆత్మనిగ్రహము గలవాడు గనుక అతని జ్ఞానమును, శక్తి సామర్థ్యములను తన కొరకు, తన దేశ ప్రజల కొరకు వినియోగించును అతడు శ్రద్ధగా పని చేయుచుయోచించి ఖర్చుచేయును. అందును బట్టి అతడు, అతని కుటుంబము సురక్షితముగా యుండును. నీతిగలవాడు అబద్ధములాడడు, మోసగించడు, దొంగిలడు, ద్రోహము చేయడు, అతడు శుద్ధ మనస్సు గలవాడు. ఆరోగ్యవంతుడు. యితరులకు సాయముచేయుటకు ఎల్లవేళలా సిద్ధపడి యుండును, క్షమించుటకు సిద్ధపడును, కోపించుటకు నిదానించును. బాధలలో ఓర్పును, మరణములో శాంతిని గలవాడు, అనుకరించుటకతడు ఒకమంచి మాదిరి, అతని మాటలనంగీకరించదగినవాడు, మంచి సలహాదారుడు.

**నీతివలన జానాంగము ఘనతనొందును :**

దేవుని యందు పెక్కుమంది విశ్వాసులు గల దేశముసంపన్న దేశమై యుండును "నీతి జనములు ఘనతకెక్కుటకు కారణము, పాపము ప్రజలకు అవమానము తెచ్చును" (సామె 14:34). కొన్ని అబద్ధమతములు ఈలోకసంగతులను పూర్తిగా త్యజించాలని చెబుతాయి. గాని బైబిలులో బయలు పరచబడిన నిజ క్రైస్తవ్యము ఇహపరములయందు సంపన్నతను గూర్చి బోధించున్నది. దేవుడు ఆర్థికంగా ఈలోకములో మనలను దీవించును. దానిని బట్టి మనము ఆసుపత్రులను నిర్మింతుము, బీదలను ఆదుకొందుము. సత్క్రియలను చేయుదుము. యేసుక్రీస్తునందును, బైబిలునందును విశ్వాసియైన వాడు ఈలోకములో ఆత్మీయముగాను ఆర్థికముగాను ఆశీర్వదించబడును.

- ఓటిస్ గేట్వుడ్

# ఆ తొమ్మండుగురు ఎక్కడ ?
# (Where are the Nine ? )

"యేసు ప్రభువు ఒక గ్రామము లోనికి వెళ్లుచుండగా పదిమంది కుష్ఠ రోగులు ఆయనకు ఎదురుగా వచ్చి దూరమున నిలిచి యేసుప్రభువా, మమ్ము కరుణించుమని కేకలు వేసిరి. ఆయన వారిని చూచి - మీరు వెళ్లి యాజకులకు కనుపరచుకొనుడని వారితో చెప్పెను. వారు వెళ్లుచుండగా శుద్ధులైరి. వారితో ఒకడు తనకు స్వస్థత కలుగుట చూచి గొప్ప శబ్దముతో దేవుని మహిమపరచుచు తిరిగివచ్చి ఆయనకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచు, ఆయన పాదముల యొద్ద సాగిలపడెను. వాడు సమరయుడు. అందుకు యేసు - పది మంది శుద్ధులైరికారా, ఆ తొమ్మండు గురు ఎక్కడ ? ఈ అన్యుడు తప్ప దేవుని మహిమపరచుటకు తిరిగి వచ్చిన వాడెవడును అగపడలేదా అని చెప్పి-నీవు లేచి పొమ్ము నీ విశ్వాసము నిన్ను స్వస్థపరచెనని వానితో చెప్పెను" (లూకా 17:12-19).

ఆరోజులలో శుద్ధుడైన కుష్ఠరోగి సమాజములో తిరిగి ప్రవేశించుటకు గాను యాజకునికి కనబరచుకోవాలి (లేవీ.కా. 14:1-32). అందువలననే యేసు ఆ కుష్ఠరోగులను యాజకులకు కనబరచుకొనుడని చెప్పెను. ఆ పది మంది కుష్ఠరోగులు స్వస్థపరచబడినను, వారిలో ఒక్కడు మాత్రమే కృతజ్ఞతా స్తుతులు చెల్లించుచు యేసు నొద్దకు తిరిగి వచ్చాడు. అతడు సమరయుడు అంటే యూదుడు కాని అన్యజనుడు. సాధారణంగా కృతజ్ఞత భావము కలిగి యుండని జనములో నుండి వచ్చిన వాడు. ఒక్కోసారి ఎవరిని మనం తక్కువగా అంచనా వేస్తామో వారే ఎక్కువ చేస్తారు. ఎవరి నుండి ఎక్కువ అపేక్షిస్తామో వారే చతికిలబడతారు. ఆ ఒక్కడే తిరిగివస్తే యేసు "పదిమంది శుద్ధులైరికారా, ఆ తొమ్మండగురు ఎక్కడ" అని అడిగారు (లూకా17:17). నేడు కూడా ఆ ప్రశ్న సరియైనదే.

**కృతఘ్నత (ingratitude) ఒక ఘోరపాపము :**

దేవుని మరచిన ప్రజలను కృతఘ్నతవర్ణిస్తాది: "వారు దేవునినెరి గియు ఆయనను దేవునిగా మహిమ పరచలేదు: కృతజ్ఞతాస్తుతులు చెల్లింపను లేదు గాని తమ వాదముల యందు వ్యర్థులైరి" (రోమా 1:21).

అంత్యదినములలో తిరుగుబాటు చేయు ప్రజలను కృతఘ్నత వర్ణిస్తాది: "అంత్య దినములలో అపాయకరమైన కాలములు వచ్చునని తెలిసికొనుము. ఏలాగనగా మనుష్యులు స్వార్థ ప్రియు లు, ధనాపేక్షులు, బింకములాడువారు,

అహంకారులు, దూషకులు, తలిదండ్రుల కవిధేయులు, కృతజ్ఞత లేని వారు, అపవిత్రులు, అనురాగరహితులు అతి ద్వేషులు, అపవాదకులు అజితేంద్రియులు క్రూరులు సజ్జనద్వేషులు, ద్రోహులు, మూర్ఖులు గర్వాంధులు దేవుని కంటే సుఖానుభవమును ఎక్కువగా ప్రేమించు వారు" (2 తిమో 3:1-4).

కృతజ్ఞతలేని ఇట్టి స్వభావమును గూర్చి దేవుడు మనలను హెచ్చరించారు. "ఆయన మీ కొరకు ఎన్ని గొప్పకార్యములు చేసెనో అది మీరు తలంచుకోవాలని" ఆయన కోరుచున్నారు (1 సమూ 12:24). కృతజ్ఞత కలిగియుండడం మన విధి. కృతజ్ఞత లేకపోవడం మన యొక్క ఘోర బలహీనత, గొప్పపొరబాటు. అది లేకపోతే ఆదర్శ ప్రవర్తనకవుసరమైన లక్షణం లేక పోయినట్లే.

**మానవుని యెడల మానవునికి కృతజ్ఞత లేకపోవుట:**

మానవులకు మానవులకుమధ్య కృతజ్ఞత లేక ప్రవర్తించిన సందర్భాలు బైబిలులో పెక్కు కలవు.

1. యాకోబు చేసిన దీర్ఘకాల పరిచర్యకు లాబాను కృతజ్ఞత యేమీ చూపలేదు. ఈ సంగతిని యాకోబు ఎరిగినవాడై లాబాను కుమార్తెలైన లేయా, రాహేలులతో ఇట్లన్నాడు. "మీతండ్రికి నాయావచ్ఛక్తితో కొలువు చేసితినని మీకు తెలిసేయున్నది. మీ తండ్రి నన్ను మోసపుచ్చి పదిమార్లు నా జీతము మార్చెను" (ఆది.కా. 31:6-7).

2. ఫరో సేవకుడగు పాన దాయకుల అధిపతి యెడల యోసేపు దయగలిగి ప్రవర్తించి అతని కలకు సరియైన భావము తెలియజెప్పినను, ఈ కృతజ్ఞత హీనుడు రాజు తన ఉద్యోగమును తిరిగి తనకిచ్చినప్పుడు "అతడు యోసేపును జ్ఞాపకము చేసి కొనక అతని మరిచిపోయెను" (ఆది. కా. 40:1-23).

3. ఇశ్రాయేలీయులను మోషే ఐగుప్తు బానిసత్వము నుండి విడిపించెను. గాని కొద్ది దినములలోగానే, విడుదల పొందిన యూదులు మోషే మీద సణగిరి, రాళ్లు రువ్వి అతని చంపుటకు సయితము సిద్ధపడిరి (నిర్గమ 17:1-4).

4. దావీదు సౌలు రాజును చంపకుండ విడిచిపెట్టెను (1 సమూ 24 అధ్యా). గాని కృతజ్ఞతలేని సౌలు దావీదును చంపుటకే సంకల్పించు కొనెను.

5. అబ్షాలోము తన తండ్రియైన దావీదు రాజుకు ఎంత కృతజ్ఞత కలిగి యుండెనంటే, ఆ దేశపు ప్రజల హృదయాలను రాజువైపు గాక తనవైపే త్రిప్పుకొనెను (2 సమూ 15:1-6). ఎంత కృతఘ్నుత ! ఎంత స్వార్థము !

**దేవుని యెడల మానవునికి కృతజ్ఞత లేకపోవుట :**

1. ఈవిషయంలో ఇశ్రాయేలీయులే ఒక గొప్ప ఉదాహరణ. దేవుని ప్రజలుగా వారు ప్రత్యేకముగా దీవించబడెను, వారు దేవుని మరచి పోయారు. మోషే వారిని గూర్చి చెబుతు. "నిన్ను పుట్టించిన ఆశ్రయ దుర్గమును విసర్జించితివి, నిన్ను కనిన దేవుని మరిచితివని" చెప్పెను (ద్వితి 32:18).

2. సౌలుకు పేరు ప్రఖ్యాతులు లేనప్పుడు అతడు దేవునికి విధేయుడైన సేవకునిగా యుండెను గాని దేవుడతనికి పేరు ప్రఖ్యాతులననుగ్రహించేసరికి, తన ఆశీర్వాదమునకుకారకుడైన వానిని మరచాడు (1 సమూ 15:10-26). ధనసమృద్ధి తరచు కృతఘ్నుతకు దారి తీస్తాది. ధనహీనతను, నిరుపేదస్థితిని అనుభవించే వరకు వారికి కృతజ్ఞతా భావములు ఉత్పన్నముకావు. తమ పెరటిలో యున్న బావి ఎండిపోతేనే గానిదాని ప్రయోజనమును మనుష్యులు తెలిసికోలేరు.

**అయితే ఆతొమ్మండుగురు ఎక్కడ ?**

పై సందర్భములను బట్టి మనం ఈ ప్రశ్న వేసుకోక తప్పదు: ఆ తొమ్మండగురు ఎక్కడ ?

అనుదినం శారీరకంగాను, ఆత్మీయంగాను వేలాది దీవెనలతో మనం దీవించబడుచున్నాము (ఎఫెసీ 1:3 యాకోబు 1:5,17) గాని తరచు మనకు అన్నం పెట్టిన వారినే మరచి పోతాము! అనేకులు అన్నం తింటారుగాని, దాన్ని దయచేసిన దేవుని వైపు చూడనే చూడరు.

రోగము నుండి, వ్యాధి బాధలనుండి విడుదల పొందిన వారిలో ఎవడో ఒకడు ఆరాధనకు వచ్చి కృతజ్ఞత చెల్లించుచుండ వచ్చును, గాని మిగతా తొమ్మండుగురు ఎక్కడ ?

అగ్ని ప్రమాదము నుండి,ఏక్సిడెంటు నుండి, యుద్ధము నుండి రక్షింపబడి సజీవుడుగా యున్నవాడెవడో ఒక్కడు ఆరాధనలో పాలుపొంది కృతజ్ఞత చెల్లించుచుండవచ్చును గాని ఆ తొమ్మిది మంది ఎక్కడ ? వారికి కృతజ్ఞత లేదు ! అభినందన లేదు !!

మనం పనిచేసుకొను నిమిత్తం సోమవారం నుండి శనివారం వరకు దేవుడు మనకు ఆరు రోజులు మట్టుకు జీవాన్ని తరుణాలను యిచ్చారు (అపొ.కా. 17:25: నిర్గ 20:9). గాని వారంలో మొదటి దినాన్ని యేమి చేసాము ? ప్రభువుదినాన్ని ఎట్లు గడుపుచున్నాము ? ప్రభువుదినాన్ని కృతజ్ఞత భావముతో గడపాలని చెబుతు, చైనా దేశీయుడైన బోధకుడు ఒక ఉదాహరణ చెప్పాడు. ఒక మనుష్యుడు తన జేబులో ఏడు రూపాయ నాణెములతో బజారుకు వెళ్లాడు. అక్కడొక భిక్షగాని దుస్థితి చూచి వానికి ఆరు రూపాయలు దానం చేసేసాడు.

గాని అతను వెళ్లచుం డగా వెనుకనుండి ఆ భిక్షగాడు వచ్చి ఆ ఏడో రూపాయిని కూడ దొంగిలించేసాడు. వాడెంతహీనుడో! అవునని నీవనుకొనేలోగా, నీవు కూడా అంతే హీనుడవని నిన్ను నీవే తీర్పు తీర్చు కొనుచున్నావు. కృపగల దేవుని చేతినుండి నీవు ఆరు దినములు పొంది యున్నావు. దానితో సంతృప్తి జెందక ఏడోదినాన్ని కూడా నీవు ఆయన నుండి దొంగిలించుచున్నావు గనుక ఆరాధన సమయంలో కానుక లెత్తుచుండగా, "ఆ తొమ్మిది మంది ఎక్కడ "? అని ప్రశ్నించుకో (1 కొరింథీ 16:1-2).

ఆత్మల రక్షణ కొరకై స్థానిక సంఘము చేయు కృషిలో, "ఆ తొమ్మండు గురు ఎక్కడ?" ఇతరులను రక్షించడానికే మనము రక్షింపబడ్డాము. అపో.పౌలు సువార్తను గూర్చి యితరులకు ఋణపడి యున్నానని తలంచాడు. "గ్రీసు దేశస్థుల కును, గ్రీసుదేశస్థులుకాని వారికిని జ్ఞానులకును మూఢులకును నేను ఋణ స్థుడను కాగా నావలననైనంత మట్టుకు రోమాలోని మీకును సువార్త ప్రకటిం చుటకు సిద్ధముగా ఉన్నాను. సువార్తను గూర్చి నేను సిగ్గుపడువాడను కాను" అని అతడు చెప్పాడు (రోమా 1:14-15).

**కృతజ్ఞత కలిగి యుండుడి :**

"మరియు కృతజ్ఞులైయుండుడి" యనునది దేవుని ఆజ్ఞ (కొలస్స 3:15). "ప్రతి విషయమునందును కృతజ్ఞతా స్తుతులు చెల్లించుడి" (1 థెస్స 5:18). "ప్రార్థన యందు నిలకడగా యుండి కృతజ్ఞత గలవారై దానియందు మెలకువగా ఉండుడి" (కొలస్స 4:2).

మన దైనందిన జీవితంలో దేవునికి, తోటి మానవులకు కృతజ్ఞత కలిగి యుండే సంగతులనేకము లున్నాయి. తినడానికి తిండి, కట్టు కొనడానికి బట్ట, ఉండడానికి వసతి, చేయడానికి పని, మంచి భార్య / భర్త పిల్లలు, మిత్రులు, సంఘము వగయిరా లన్నిటి కొరకు దేవునికి కృతజ్ఞత కలిగి యుందము.

"కాగా దేవుని చేత ఏర్పరచ బడిన వారును, పరిశుద్ధులును ప్రియులునైన వారికి తగినట్లు మీరు జాలిగల మనస్సును, దయాళు త్వమును, వినయమును సాత్వికమును దీర్ఘశాంతమును ధరించుకొనుడి" (కొలస్స 3:12). కృతజ్ఞత కలిగి యుండుడి. ఆ తొమ్మండుగురివలె యుండకుడి, స్వస్థత పొంది కృతజ్ఞతా స్తుతులు చెల్లించుటకు యేసు నొద్దకు తిరిగి వచ్చిన ఆ సమరయుని అనుకరించుడి.

– లీరోయ్ బ్రౌన్లో

# బైబిలును అర్థము చేసికొనుటకు పది సూత్రములు
## (Ten Simple Reasons to Understand the Bible)

ప్రపంచ గ్రంథములన్నిటిలోను గొప్ప గ్రంథముగా నేటికిని బైబిలు ఉన్నది. మనము 21వ శతాబ్దములో యున్నాము. అయినను బైబిలు గొప్ప గ్రంథముగాను, పెక్కు మందిచే చదువ బడుచున్న గ్రంథముగాను నేటికిని తన స్థానమును కోల్పోవకుండ యున్నది. ప్రతి సంవత్సరము ఇంచుమించు 4 కోట్ల బైబిళ్లు ముద్రించబడుచున్నవి. ఈముద్రణ కార్యక్రమములో 1,53,000 మంది అనుదినము ప్రపంచ మందంతటా పని చేయుచున్నారు. ఆధునిక మానవునికి అత్యవసరమైన గ్రంథము బైబిలు.

**బైబిలును అంతమంది ఎందుకు ప్రేమించుచు చదువుచున్నారు?**

ఏలయనగా తనను గూర్చి బైబిలు ఏమని చెప్పుకొనుచున్నదో అది వాస్తవ మని వారెరుగుదురు: మానవులకు దేవుడిచ్చిన వర్తమానము అది. అపొస్తలు లు, ప్రవక్తల ద్వారా దేవుడు బైబిలు నందలి 66 పుస్తకములను పరిశుద్ధాత్మని బయల్పాటు వలన లిఖించి యిచ్చెను. అది దైవప్రేరణచే వ్రాయబడెను, 2 తిమోతి 3:16,17: యోహాను 14:26; యోహాను 16:13; ఎఫెసీ 3:4-5లను దయచేసి చదువండి.

బైబిలు దేవునినుండి కలిగినదని అనేక సంగతులు నిరూపించుచున్నవి :

కొందరు పురాతత్వ శాస్త్రజ్ఞులు మొదట వారు నాస్థికులైనను, వారు త్రవ్వి కనుగొనిన సత్యములను బట్టి బైబిలు చారిత్రాత్మకముగాను, భౌగోళి కముగను యదార్థమని గ్రహించి విశ్వాసులుగా మార్చబడిరి. గొప్ప విజ్ఞానశాస్త్ర సంబంధమైన సత్యములు బైబిలునందుండుటచే అది దైవప్రేరిత గ్రంథమని విశదమగుచున్నది. అందరు భూమి బల్లపరుపుగానుండెనని నమ్ము తుంటే, దాని లేఖకులు అది గుండ్రము గా నుండెనని వ్రాసిరి (యెషయా 40:22). భూమి దేనిపై ఆధారపడి యున్నదో యని శాస్త్రవేత్తలు తర్కించు కొనుచుండగా, "దేవుడు శూన్యముపై భూమిని వ్రేలాడజేసెనని" అది చెప్పు చున్నది (యోబు 26:7). 40 మంది లేఖకులు 1600 సంవత్సరముల కాలములో దాన్ని వ్రాసినను దానిలోని ఏకత్వమును బట్టి అది మానవుని మేధస్సు వలన కాదు గాని దేవుని నుండి కలిగినదని నిరూపణయగు చున్నది.

**మనము బైబిలును అర్థము చేసికోగలము, అర్థము చేసుకోవాలి:**

మన హృదయం నిష్కపటమైన దయితే దాని ప్రాథమిక బోధలను సునాయాసంగా అర్థము చేసికోగలము. దాన్ని అర్థము చేసుకోడానికి మనము తప్పక ప్రయత్నించాలి. గనుక ఆనందభరితమైన సమృద్ధి జీవితమును ఇప్పుడే మనం ఆరంభింపవచ్చును. దేవుని చిత్తమును జరిగించుచున్నామని తెలిసికొనుటలోను, పరలోకము మనదగునని ఎరుగుటలోను మనకు గొప్ప ఆనందము కలుగును. గనుక బైబిలును అర్థము చేసికొనుటకు 10 సూక్ష్మ సూత్రములను ఈ పత్రిక ద్వారా మీకు అందించుచున్నాను.

**1. దానిని అర్థముచేసికొను కోరికతో పఠించుము:**

మనం అర్థము చేసుకొనుటకే దేవుడు బైబిలు నిచ్చారు. "మీరు అవివేకులు కాక ప్రభువు చిత్తమేమిటో గ్రహించుకొనుడి" యని ఎఫెసీ 5:17 చెప్పుచున్నది. బెరయలోని ప్రజలు ప్రతి దినము లేఖనములను పరిశోధించుచు వచ్చిరి గనుక వారు ఘనులని చెప్పబడిరి (అపొ.కా. 17:11). యితరులైతే "యెల్లప్పుడు నేర్చుకొనుచున్నను సత్యము విషయమైన అనుభవజ్ఞానము ఎప్పుడు పొందలేని" బుద్ధిహీనులని చెప్పబడినది (2 తిమోతి 3:6,7). దేవుని యెడల ప్రేమ, ఆయన వాక్యమును గ్రహించుకోవాలనే కోరిక యున్నప్పుడు బైబిలును మనం అర్థము చేసికోగలము. "నీతి కొరకు ఆకలి దప్పులు గలవారు ధన్యులు వారు తృప్తి పరచబడుదురు" అని యేసుప్రభువు చెప్పెను (మత్తయి 5:6). మనం దేని కొరకైనా ఆకలి దప్పులు కలిగియుంటే ఆ కోరికను తీర్చుకొనుటకు ప్రయత్నింతుము. "ఎవడైనను ఆయన చిత్తము చొప్పున చేయనిశ్చయించుకొనిన యెడల ఆ బోధ దేవుని వలనకలిగినదో, లేక నాయంతట నేనే బోధించుచున్నానో వాడు తెలిసికొనును" అని యేసు చెప్పెను (యోహాను 7:17). దేవుని చిత్తము చొప్పున చేయ నిశ్చయించుకొంటే అది అర్థమగునను సంగతి గ్రహించుము. గనుక బైబిలును చదువునపుడెల్ల, దేవుని చిత్తాన్ని తెలిసికొని దాన్ని జరిగించ గోరుచున్నానా? యని మనలను మనం ప్రశ్నించుకోవాలి. మనం నిజంగా ఆకలి దప్పులు కలిగియుంటే తృప్తిపరచబడుదుము.

**2. అర్థము చేసికోగలిగినదంతా ఇప్పుడు అర్థం చేసికో, మిగతా సంగతులు తరువాత అర్థమగును :**

బైబిలునంతటిని క్షుణ్ణంగా

అర్థము చేసికొనుటకు కనిపెట్టుటకంటే దానిలోని సూక్ష్మ సంగతులను ఇప్పుడే మనం అర్థము చేసికోవచ్చును. పసి వారికి పాలవలె బైబిలులో సూక్ష్మమైన సంగతులున్నవి. అట్లే బలవంతులకు మాంసము వలె అందులో లోతైన మర్మములున్నవి (హెబ్రీ 5:12-14). మనము బైబిలు చదివేకొలది దానిలోని ప్రతి భాగము విశదమగుచుండును. అయితే దానిలోని ప్రతిసంగతీ సంపూర్ణముగా అర్థమయ్యే వరకు కనిపెట్టుట కంటే, దేవుడు మనలను చేయుమని ఆజ్ఞాపించిన వాటిని చేయుటకు మొదలుపెట్టాలి.

మార్టిన్ లూథర్ చిన్నతనంలో ఒక ఏపిల్ చెట్టు మీద కొద్దిపాటి కాయలు మాత్రమే పండ్లవడం చూచాడు. అయితే సాధ్యమైనంత ఎక్కువ ఏపిల్‌పండ్లు కొరకు అతడు చెట్టును కుదిపేవాడు, తరువాత మిగతా కాయలు పండ్లయ్యేకొలది వాటిని అతడు సంపాదించుకొనేవాడు. యిదే సూత్రాన్ని అతడు తన బైబిలు పఠనమునకు వర్తింపజేసుకొన్నాడు. అతడు గ్రహించు కోగలిగినంత సాధ్యమైనంత త్వరలో గ్రహించుకొన్నాడు. తరువాత కఠినమైన సంగతులు అతనికి సులభమయ్యాయి.

బైబిలులో కొన్ని సంగతులు గ్రహించుటకు కష్టమైనవి కలవు (2 పేతురు 3:16). ఇక్కడ కొన్ని సంగతులే అని చెప్పబడెను గాని అన్ని సంగతులు కావు. అయితే కష్టమైన కొన్ని సంగతులను కొందరు తమ స్వకీయ నాశనము కొరకు అపార్థము చేసికొందురు. ఈ సంగతులను అర్థము చేసికొనలేరని అక్కడ చెప్పబడలేదు, గాని అర్థము చేసికొనుటకు కొంచెము కష్టమైనవి.

మన దేవుని యెడలను తోటి మానవులయెడలను నిర్వర్తించ వలసిన విధులను గూర్చిన సంగతులు సులభమైనవి. వాటిని మనం గ్రహించుకొని దేవునికి విధేయులు కావాలి. తరువాత ఎక్కువ నేర్చుకొనవచ్చును. (మత్తయి 28:19-20). అనేకులు క్రీస్తును గూర్చి వినిన మొదటి దినమందే క్రైస్తవులైనట్లు అపొస్తలుల కార్యములు చెప్పుచున్నది. తరువాత వారు విశ్వాసములో పెరిగారు. అభివృద్ధి జెందారు. దేవుని చిత్తాన్ని తెలిసికొని దాన్ని జరిగిస్తే శాంతి సమాధానములు కలుగుతాయి.

(సశేషము)

- చార్లస్ స్కాట్

మీరు సత్యవాక్కు సాలు చందా చెల్లించారా? లేదా ఇప్పుడే 50/- రూపాయలు పంపించి మీ పత్రిక కొనసాగించుకొనండి. క్రొత్తవారిని చేర్పించండి. -ఎడిటర్

భారతదేశములో క్రీస్తుసంఘము పునరుద్ధరింపబడుచుయున్నదని జాషువాగారు సంఘచరిత్రను క్లుప్తముగా వివరించిరి.

స్థానిక సువార్తికులు జయపాల్ గారు, దీనదయాళ్ గారు మధ్యలో ప్రోత్సాహకరమైన మాటలు చెబుతు సదస్సును రంజింపజేసిరి. వచ్చిన వారందరికీ ర్యాలిక్రీస్తు సంఘము రుచి,శుచిగల భోజనపదార్థములను వడ్డించిరి.సోదరులు వి.రాజ్‌కుమార్ (అమలాపురం)గారి ప్రార్థనతో ఆనాటి సహవాస సదస్సు ముగిసెను. జయపాల్ గారు వందన సమర్పణ చేసిరి.

2014 ఫిబ్రువరి 24,25,26 తేదీలలో జాషువాగూటం గారు సతీసమేతముగా తెలంగాణాలో పర్యటించి పలుచోట్ల బైబిలు తరగతులు,సువార్త కూటములు నిర్వహించిరి. 25వ తేదీ మంగళవారము నిజామాబాద్ జిల్లా, కామారెడ్డికి సమీపముగా యున్న దగ్గి గ్రామములో బైబిలు క్లాసు నిర్వహించిరి. అక్కడ హైవేకు సమీపంలో క్రీస్తుసంఘ ఆలయ నిర్మాణము నిమిత్తము సోదరులు జాషువాగూటం గారు పునాదిరాళ్లు వేసిరి. కవితాగూటం గారు, లెమూయేల్ ఆచారియ(యూప్రాల్)గార్లు కూడా ఈ కార్యక్రమములో పాల్గొనిరి.

దగ్గిలో జరిగిన బైబిలు క్లాసుకు మెదక్, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల సువార్తికులు కూడా కొందరు హాజరైరి. ఫిబ్రువరి 26వ తేదీ బుధవారం మెదక్ జిల్లా తూప్రాన్‌లో జరిగిన బైబిలు క్లాసులో సోదరులు జాషువాగూటం గారు చక్కటి వాక్యోపదేశముగావించిరి.సోదరులు లెమూయేల్ ఆచారియా గారు ప్రార్థన చేసిరి.వచ్చిన వారందరికీ మంచి భోజనము సరఫరా చేయబడెను. జాషువాగూటం దంపతులు తెలంగాణా పర్యటన ముగించుకొని 27వ తేదీ గురువారం కాకినాడ క్షేమముగా చేరుకొనిరి.

ఇప్పుడు సత్యవాణి-క్రీస్తుసంఘ పరిచర్యలను www.satyavanicoc.com వెబ్‌సైట్‌లో మీరు పర్యవేక్షించవచ్చును. ఈ వెబ్‌సైట్ నిర్మాణములో సేమ్యూల్‌రోనీగూటం గారు ముఖ్య పాత్రను వహించిరి. ఆయన కృషి ప్రశంసనీయము.

## మీకొక గొప్పసదవకాశం

**సత్యవాణి** ద్వారా ప్రచురింపబడిన అత్యంత విలువైన పుస్తకములు 20 రకములు ఇప్పుడు లభ్యమగుచున్నవి. వాటి నికర మూల్యము 500/- రూ॥లు అగును. గాని మీరు 120/- రూ॥లు మాత్రమే మాకు M.O పంపి వాటిని ఉచితముగా పొందవచ్చును. బైబిల్ విద్యార్థులకు, బోధకులకు తర్ఫీతుశాలలకు యిది గొప్ప సదవకాశం. ఈ రోజే మాకు వ్రాయండి. M.O పంపించి పుస్తకములను పొందండి. మీ యింటిలో మినీ లైబ్రరినీ స్థాపించండి.

# SATYA VANI


**# 7-9-35, Sambamurthy Street,**
**Kakinada - 533 004. Ph: 0884- 2363722**



RNI Regd. No. 69973/98
Postal Regd. No. AP-VM/KD/02/2012-2014


To

From:
SATYA VAKKU
P.O. Box 80, Kakinada - 533 001


Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication, Sambhamurthy St. Kakinada - 533 004